# మేలుకొలుపు

'పల్లపోతు'

అది సాయంసమయం భానుడు తన వేటను చాలించి, ఒక్కొక్క అంబుగా దీసి తన పొదిలో దాచుకుంటున్నాడు. ప్రకృతి కాంతను విడిపోవుట ఇష్టంలేనట్లుగా సంధ్యచీకట్లు ఇచ్చే ఆహ్వానాలను అయిష్టంతో స్వీకరిస్తున్నాడు. అప్పుడప్పుడే విహారములు చాలించి గూటికి చేరుకుంటున్న పక్షులకిలకిలారావములూ, షికార్లు చాలించి కొంపలకు చేరుకుంటున్న కారుల శబ్దములు తప్ప మరేమీ వినిపించటంలేదు. తమ శత్రువు వెళ్ళేడన్న ఆనందాశయంలో ఉప్పొంగి పొదలచాటునుండి వస్తున్న చీకటి ప్రకృతి ఆవరిస్తూ, తూర్పుదిశనుండీ వీచేచల్లని పిల్ల వాయువులు ఇచ్చే ఆహ్వానాలను ఆశేదీరా అందుకుంటూ, చేరువనున్న పార్కుపై దాడిచేసింది ... అప్పటికే ఆ ఫార్కులోని అన్ని బెంచీలు ఖాళీ అయినవి. ఎందుచేతనో ఆమూలబెంచీని ఆక్రమించిన 'నవనీతం' అలాగే కూర్చొనివుంది. ఒంటరిగానున్న ఆమెహృదయం ఆలోచన వీణా తంతులను మీటుతుంది.

◆ ◆ ◆

అవి నవనీతం స్కూలు ఫైనల్ చదువుతున్న రోజులు. ఆవిడ వేసే దుస్తులూ, చేసే ఆడంబరాన్ని బట్టి చూస్తే గొప్పకుటుంబీకురాలుగా కన్పిస్తుంది. నిజంచెప్పాలంటే ఒకసామాన్య కుటుంబంలో జన్మించినట్లుగా చెప్పటానికి అవకాశాలులేవు. కేవలం ఒక బడిపంతులు కూతురంటే అందరికీ ఆశ్చర్యం వేస్తుంది. ఆవిడచేసే ఆడంబరాలకు 'ఫోటోగ్రాఫర్ శ్యామ్' కారకుడని కొందరి ప్రచారం. ఏది ఏలావున్నా, విశాలమైన ముఖానికి తీర్చిదిద్దిన స్నో, పౌడరూ, కాటుకబెట్టిన చారెడేసి నేత్రాలూ, నైస్‌గా అల్లబడిన నొక్కుల జుట్టూ, నవనాగరికంగా ధరించబడిన దుస్తులతో, ఎరుపురంగుగాక చామన చాయగా 'దేవకన్య'లా కన్పించే ఆమెతో సాంగత్యాన్ని పొందగల్గిన శ్యాము నిజంగా అదృష్టవంతుడే!

ఆనాడు సోమవారం. గతదినమంతా గదిలో జరిపిన ఏకాంతానికి స్వస్తి-ఉదయం 9 గంటలకే స్కూలుకు చేరుకుంది. స్కూలంతా నిశ్శబ్దమయం. ఒంటరిగావున్న ఆమె హృదయం ఏదో మధురస్మృతులను మీట నారంభించింది. మనస్సు వాంఛలను రేకెత్తించింది. హృదయం ఆశా సముద్రంలో అల్లల్లాడ నారంభించింది. ఏకాంత జీవితంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆమె హృదయం ఏదో మధురభావాలపై స్వారిచేయనారంభించింది......ఇంతలో హఠాత్తుగా ఎవరిదో ఒక సుకుమారపు హస్తం ఆమె భుజంపైవాలింది. బాధగా, బరువుగా తన దృష్టిని వెనుకకు మరల్చింది. తన స్నేహితురాలు 'కమల' నవ్వుతూ నిలబడింది. ఏదో ఆమె చెవులో రహస్యంగా చెప్పి, గట్టిగా వీపుపై చరిచింది. ఆమెలో వెర్రి ఆనందం పరవళ్లుత్రొక్కింది. హొరటుగా తారురోడ్డుపై బడింది. చిన్నా, పెద్దా, గురువూ, దైవం, అనే విచక్షణలేకుండా పట్టపగలు శ్యాం రూముకు చేరుకుంది. తనకొరకు ఎదురుతెన్నులు బడుతున్న శ్యాం ఆమెను తన బాహుబంధాలలో రబ్బరు బొమ్మగా చేశాడు. ... ... అంతే! ... అలా ఎంతకాలం గడిచిందో; కళ్ళు తెరచి చూసింది. ముఖాన స్నో, పౌడరు చెదిరిపోయింది. బట్టలు పూర్తిగా నలిగిపోయాయి. నీరసంగాపైకి లేచింది. వికృతంగా నవ్వుతున్న శ్యామ్ ఆమెకళ్ళకు రాక్షు

నుడిలా కన్పించాడు. ఆ నవ్వులో ఏవో శూలాలు ఇమిడి వున్నయ్! అవి ఆమె హృదయాన్ని బాధ పెట్టినై. అతని మొఖం చూడలేక రెండుచేతులతో మొఖాన్ని గప్పుకుంది... ఇప్పుడు తనేంచెయ్యాలి! ...శీలభ్రష్ట! శీలమే లేకపోతే సంఘంలో స్థానమే లేదే! కాముకవృత్తికి కళ్ళు మూసుకుని కాని పని చేసింది. కర్తవ్యమేమిటి?

“నవా!” అన్నాడు మృదువుగా శిరస్సు నిమురుతూ; అమాయకంగా అతని కళ్ళల్లోకి చూచింది. ‘భయపడుతున్నావా? ఇదుగో చూడు ... నీ ఫోటోలు నాలుగు స్టూడియోలకి పంపాను. మన అదృష్టంకలసివచ్చి, ‘రమ్మని’ లెటరు వ్రాశారు. ఇదుగో చూడు! నీకు అభ్యంతరంలేకపోతే, వెళ్దాము అంటూ ఒక కవరు ఆమె చేతికిచ్చాడు. ఆత్రంగా దాన్ని విప్పి చదివింది. తన హృదయానికి హత్తుకుంది. వెర్రిగా అతన్ని నమ్మింది. తనొక పెద్ద సినిమా యాక్ట్రెసౌతానని ఉప్పొంగింది. తన పేరు వాడ, వాడలా మారుమ్రోగుతుందని సంబరపడింది. తన జన్మ తరించిందని భావించింది. తన కోరికలు నెరవేరాయని సంతోషపడింది. తల్లీ తండ్రీ, ఇతర ఆప్త బంధువుల్ని వదలి అతనితో వెళ్ళిపోయింది.

ఒకనాడు ఒక బట్టతల మనిషితో ప్రత్యక్షమయ్యాడు శ్యాము. ‘ఇతనొక ఫిలిం నిర్మాత ఇతన్ని పట్టుకుంటే సినిమాలో నటించవచ్చు’ అని ఆమెను ఒప్పించి, ఆ సుందర కోమలాంగిని ఆ బట్టతలవానికి స్వాధీనంచేశాడు. నవనీతం మొఖం తెర ఎక్కింది. కానీ, చిల్లరవేషాలతో. ఆమె తృప్తిబడలేదు. ... వేరొకనాడు ఒక సూటువాలాతో దర్శనమిచ్చాడు. ‘ఇతను డైరెక్టర్! ఇతన్ని వలలో వేసుకుంటే, తారాపథం అందుకోవచ్చు’ అని ఆ రాత్రి ఆమెను సూటువాలాకు అప్పగించాడు. శ్యాం చేస్తున్న వ్యాపారం నవనీతానికి బోధపడింది.

◆ ◆ ◆

టంగ్, టంగ్ మని క్లాక్ టవరు గొట్టిన పన్నెండు గంటలు నిశ్శబ్దాన్ని చీల్చుకొని ఆమె చెవిననాటినై. దూరమున కన్పిస్తు టాక్సీ సింహగర్జన నవనీతం ఆలోచనా నదికి ఆనకట్టయింది. కళ్లు తెరచిచూచింది. ప్రపంచమంతా నిద్రాదేవి కౌగిటిలో కలసిపోయిందని గానీ, ప్రకృతి అంతా నిశ్శబ్దమైనదని గాని ఆమెకు తెలియదు.

ఆమె మనస్సులో మెరపుతీగలా ఒక ఆలోచన తోచింది. సంతోషంతో పైకిలేచింది. అడుగు ముందుకువేసింది ‘ఆగు; ఏమిటా సాహసం! చచ్చి సాధించేదేముంది; పిచ్చిదానా! భవిష్యత్తును గుర్తించక, పిచ్చిభ్రమల్లోపడి, నీ చేతులతో నీ జీవితాన్ని నాశనంచేసుకున్నావు. అర్థంలేని ఆశలకుపోయి అగాధంలోకి కుంచుకపోయావు. ఆదర్శంగా జీవించాల్సినదానివి అధోగతిపాలయ్యావు. నీ జీవితంలో నీవు చేసిన పొరపాటుకు తగిన శిక్ష అనుభవించావు. పాపాలకు పశ్చాత్తాపమే పరిహారం. ఇప్పటికైన కళ్ళు దెరిచావు. నీచమైన ఈ వృత్తికి స్వస్తిజెప్పు! చదువుకున్నావు; దాన్ని సద్వినియోగంచేయి! వెళ్ళు; పో!’

నవనీతం వెనుకకు తిరిగింది. అంతే! ఆనాటి నుండీ, ఏమయిందీ ఎవరికీ తెలియదు. ఎవరికి కన్పించలేదు. కన్పించదు. కన్పించాల్సిన అవసరంకూడా లేదు.

